# నూతిలో పిల్లి

పి.వి.రమణ

"ఈ మనిషికి ఎప్పుడూ మొద్దునిద్రే. పడుకునేముందు బయటసామానులు అవీ చక్కబెడదాం అనిలేదు. అన్నిటికీ ఒక్కదాన్నే దొరికాను చవగ్గా... ఖర్మ" శ్రీమతి కేకలకు నిద్రలో కూరుకుపోతున్న కళ్లను బలవంతంగా తెరిచి పక్కమీంచి దిగాను.

"అబ్బ... ఏమిటే నీ గోల? నీ సర్దుడు కార్యక్రమం అయ్యేవరకు నిద్ర పోనియ్యవు కదా. ఏం చెయ్యమంటావో చెప్పు" ఆవులిస్తూ అడిగాడు.

"మీకు ఎప్పటికప్పుడు అన్నీ కొత్తే. మధ్యాహ్నం చెప్పాను. పిల్లి వంటిల్లు అంతా తిరుగుతోంది. అసలే అది ఒట్టిది కాదు కూడాను. ఏ మూలలోనో పిల్లల్ని పెట్టేస్తుందో ఏమో ఖర్మ. ఒకసారి చూడండి" పెరట్లో కడిగిన గిన్నెల్ని స్టాండ్‌లో బోర్లిస్తూ అంది.

'ఈ పిల్లి ఎక్కడ దాపురించిందో నా ప్రాణం మీదకు' అనుకుంటూ వంటింట్లోకి వెళ్లాను.

శ్రీమతి అనుమానం నిజమే.

గ్యాస్ సిలిండర్ మూల ఖాళీ జాగాలో నుండి రెండు కళ్ళు మెరుస్తున్నాయి. వెంటనే లైట్ వేసాను. వెలుతురుకు అది ఒక్కసారి తుళ్లిపడి లేచి నావైపు దీనంగా చూసింది.

"ఛ... బయటకి పద. ఇంకెక్కడా ప్లేస్ దొరక లేదా నీకు" అంటూ బయటకు తరిమాను.

వెనకే కిలకిలా నవ్వుతూ "చిన్నపిల్లకు చెప్పినట్లు చెబుతున్నారు. మీ మాటలు దానికి అర్థమవుతాయా?" అంది శ్రీమతి.

కానీ కొద్దిరోజుల్లోనే శ్రీమతికి అర్థమయింది ఆ పిల్లి నా మాటల్ని బాగా అర్థం చేసుకోగలదని.

బరువుగా అడుగులు వేసుకుంటూ మధ్య మధ్య ఆ వైపు దీనంగా చూస్తూ వెళ్లిపోయిందా పిల్లి.

నిజం చెప్పొద్దూ ఆ పిల్లి అలా వెళుతుంటే నా మనసు జాలితో నిండిపోయింది.

శ్రీమతి చక్కబాట్లు పూర్తయ్యేసరికి పదకొండయింది. తమ రాజైన చంద్రుని కోసం తలో దిక్కుగా వెతుకుతున్న భటుల్లా ఆకాశం నిండా నక్షత్రాలు పరుచుకున్నాయి.

అలసిన శరీరం పక్కమీదకు వాలినదే తడవుగా గాఢనిద్రలోకి జారిపోయింది.

***

"ఏమండీ! ఒకసారిటు చూడండి" శ్రీమతి కేకలకు తృళ్లిపడి లేచాను.

అప్పటికింకా చీకటితెరలు పూర్తిగా వీడలేదు. వెలుగు పరుచుకుంటోంది.

కళ్ళు నలుపుకుంటూ లేచాను. శ్రీమతి వంటింట్లోంచి కేకలు పెడుతోంది.

అటుగా వెళ్లాను. అక్కడ-

గ్యాస్ స్టవ్ గట్టు క్రింద ఒక మూలగా కనిపించింది పిల్లి. దాని పక్కనే మూడు పిల్లలూను.

ఒక్కక్షణం నాకేమీ అర్థంకాలేదు. అసలు అది కలో నిజమో తేల్చుకోలేక పోయాను. రాత్రి దాన్ని బయటకు తరిమేసాను. బయటకు వెళ్తూ అది నావైపు చూసిన చూపు ఇంకా నాకు గుర్తుంది. అన్ని తలుపులు వేసేసినా అది లోపలికి ఎలా వచ్చింది?

జాగ్రత్తగా చూసుకుంటూ బయటకు వెళ్లాను.

అక్కడ దృశ్యం చూడడంతో నాకు ఆశ్చర్యం రెట్టింపయింది. అంతేకాదు ఔరా అని మనసులోనే పిల్లిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

మనుష్యులకే కాదు, ఏ ప్రాణికయినా అవసరమే ఆలోచనలని ప్రేరేపిస్తుందేమో!

"ఏమిటండీ అలా నిలబడిపోయారు? ఈమధ్య నిలబడే నిద్ర పోతున్నారా ఏమిటి ఖర్మ?" అంటూ వచ్చింది శ్రీమతి.

అక్కడ కిటికీ తెరిచి వుంది. తలుపు వెనుక గట్టుమీద ఉంచిన పింగాణి జాడీ గట్టుకింద ఉంది.

పాపం పిల్లి ఎంత కష్టపడిందో మరి ఆ జాడీని పడవేయకుండా జాగ్రత్తగా క్రిందకు దించింది. ఆ తలుపు తెరుచుకుని లోనికి ప్రవేశించిందన్న మాట. ఒక ప్రశ్నకు సమాధానం దొరికింది.

విషయం అర్థం చేసుకున్న శ్రీమతి కూడా ముక్కుమీద వేలేసుకుంది.

రెండ్రోజుల తరువాత పిల్లిపిల్లలతోసహా బయట మెట్లకిందకు మకాం మార్చింది.

అది ఖాళీ చేసిన ప్రదేశాన్ని కడిగి ఫినాయిల్‌తో శుభ్రం చేసాము.

అయితే అక్కడితో ఆగిపోలేదు ఈ మార్జాల పాఖ్యానం. ఆ రోజు ఉదయం స్నానానికి వెళుతూ బాత్రూంవైపు అడుగులేసాను.

'మ్యావ్' అంటూ నోరంతా చాపి అచ్చం బాగా ఆకలితో వున్న మనిషి తన ఆకలిని తెలియజేసేవిధంగా అతి దీనంగా నా కాళ్లకు అడ్డం పడింది.

అసలే నాది జాలి గుండెమో (అవును మా పిల్లలంతా అలాగే అంటారు మరి) కరిగి కన్నీరైంది.

"ఏమేవ్! దీనికి కొంచెం పాలు పోయి. అసలే పిల్లల తల్లి కూడాను" అని శ్రీమతికి పురమాయించాను.

"పోదురూ మీరు మరీను. దానికి కూడా తెలుసు మీ దగ్గరైతే దాని ఆటలు సాగుతాయని. ఉండండి దాని పనిచెప్తాను" అంటూ కోపంగా పిల్లివైపు వచ్చేసరికి అది తుర్రున పారిపోయింది. కానీ అంతలోనే మళ్లీ మ్యావ్ అంటూ నా కాళ్లకు అడ్డం పడింది.

ఈలోగా శ్రీమతి నవ్వుతూ ఒక చిన్న కప్పుతో పాలు తీసుకొచ్చి దాని ముందు పెట్టింది.

అవి చప్పరిస్తున్నప్పుడు ఆ పిల్లి కళ్లల్లోని భావాన్ని ఏమని అనువదించను?

***

ఆ రోజు సాయంత్రం స్కూలు నుండి వచ్చేసరికి శ్రీమతి కొంచెం ఆందోళనగా కనిపించింది.

"ఏం అలా వున్నావు?" ఆతృతగా అడిగాను.

"మీ దత్తపుత్రిక... అదేనండి మీ పిల్లి..."

"ఏయ్... అదేం నా దత్తపుత్రిక కాదు. కాకపోతే ఏదో దాని విషయంలో కొంచెం జాలిపడ్డానంతే" బుంగ మూతి పెట్టి కూచున్నాను.


"అది కాదండి. అసలు విషయం వినండి మరి. నల్లచారల పిల్లి ఒకటి వస్తుండేది చూడండి. అది ఈ పిల్లి పిల్లల్ని కాజేయడానికి వచ్చింది. దాన్ని ఇది వెంట బెట్టుకువచ్చింది. ఆ నల్లపిల్లి నూతి గట్టు ఎక్కి పారిపోయింది. పాపం ఇది కూడా నూతి

గట్టు ఎక్కి దాన్ని మరికొంత దూరం తరుముదామనుకుందో ఏమోగానీ... గట్టు దాటలేకపోయింది.

"అరే ఏమయ్యింది?" ఆతృతగా అడిగాను.

"నన్ను చెప్పనిస్తేనా? అది గట్టు దాటలేక నూతిలో పడిపోయిందండీ" విచారంగా చెప్పింది.

"ఆ..." అంటూ ఒక్క అంగలో ఈశాన్యంలో వున్న నూతి దగ్గరకు చేరుకున్నాను.



అయితే ఈ సంవత్సరం కరువుకి, సూర్యప్రతాపానికి ఆ నుయ్యి పూర్తిగా ఎండిపోయింది. అంత మటుకు ఆ పిల్లి అదృష్టమే. సుమారు 30 అడుగుల లోతున ఆ పిల్లి బిక్కుబిక్కుమంటూ చూస్తోంది. అప్పటికే చేదలో కొంచెం పాలు పోసి తాడుతో నూతిలోకి దించి వుంది శ్రీమతి.

చెప్పొద్దూ మా ఆవిడ మనసు నారికేళంలాంటిది. పైకి కఠినమేగానీ లోన మధుర జలమే.

ఒక్కక్షణం శ్రీమతి చేసిన పనికి మనసు మురిసినా వెంటనే నాలో ఆందోళన మొదలైంది. 'అయ్యో పిల్లలు ఎలా వున్నాయో' అని అటువేపు వెళ్లాను. ఇంకా కళ్ళు కూడా తెరవని పిల్లలు కీచుకీచుమంటున్నాయి.

తల్లి అలా.. పిల్లలు ఇలా... ఏం చేయాలో పాలుపోలేదు.

ఓవైపు పొద్దు వాలిపోతోంది. నూతి దగ్గరకు వెళ్లి చేదను కట్టిన తాడు తీసుకుని పిల్లి దగ్గరకు చేదను తీసుకువస్తూ అందులోకి దిగమని నానావిధాలుగా దానికి చెప్పడానికి ప్రయత్నం చేసాను.

ఒకవైపు నా యత్నాలనుచూసి నవ్వుతూనే ఇంకోవైపు తన ప్రయత్నం తాను కూడా చేస్తోంది శ్రీమతి.

"నడుముగానీ విరిగిందో ఏమో? అసలు కదులుతుందా?" నాలో నేను అనుకున్నట్లు పైకి అనేసాను.

"ఇందాక ఆవైపు వుండేది. ఇప్పుడు ఈవైపుకి వచ్చింది. కాబట్టి దెబ్బ ఏమీ తగిలి ఉండకపోవచ్చు" శ్రీమతి సమాధానం.

మేం ఎంత ప్రయత్నం చేస్తున్నా అది ఆ చేదలోకి రావడంలేదు.

"అంత చిన్న చేదలోకి అదెలా దూరుతుందండీ?" ప్రక్కింటాయన వస్తూనే అనుమాన బాణం సంధించాడు.


నిజమే అనుకుని ఆ చేదను బయటకుతీసి ఇంట్లోని ఓ ప్లాస్టిక్ బకెట్‌ని తాడుతో కట్టి ఈసారి అందులో ఒక ఎండు చేప ముక్కని కూడా పెట్టి లోపలకు దించాము. అయినా పిల్లి అందులోకి కూడా రాలేదు.

చీకట్లు ముసురుకుంటున్నాయి. కానీ మా ప్రయత్నాలు సఫలీకృతం కావట్లేదు.

ఇక లాభం లేదనుకుని చివరి ప్రయత్నంగా ఆ బక్కెట్‌ని పైకి తీసి అందులో కొంచెం పాలుపోసి మళ్లీ నూతిలోకి దించాము. కనీసం ఏ రాత్రికయినా ఆ బకెట్‌లోకి అది దిగితే ఉదయాన్నే పైకి తియ్యవచ్చు అని ఏ మూలో చిన్న ఆశ.

అప్పటికి మా ప్రయత్నాలు కట్టిపెట్టి దైనందిన పనులలో మునిగిపోయాము.

ఆ రాత్రి అన్నం కూడా సహించలేదు.



## అందం-అభినయం

చాలాకాలం తరువాత మన బాలీవుడ్ తారలు హాలీవుడ్‌పై కన్నేస్తున్నారు. ఇప్పటికే తన నటనతో సత్తా నిరూపించుకున్న ఐశ్వర్యా రాయ్ అంతర్జాతీయ నటిగా తనకంటూ ఒక గుర్తింపుని తెచ్చుకుంది. ఆమె ఏం చేసినా డిఫరెంట్‌గా ఉంటుంది. సల్మాన్ విషయంలో జరిగిన తప్పులు మళ్ళీ జరగకుండా ఆమె కెరీర్ పైనే దృష్టిని కేంద్రీకరిస్తోంది. అందం, అభినయం విషయంలో ఎంతో శ్రద్ధని కనబరిచే ఈ తార కొత్తదనం కోసం ఎప్పుడూ వెంపర్లాడుతుంటుంది. వ్యాపారప్రకటనల్లో అయితే ఈ వైవిధ్యం ఎక్కువగా కన్పిస్తుంటుంది.

"దాన్ని గురించి మీరెందుకండీ అంతా ఇదయిపోతున్నారు. ఉదయం మళ్లీ ఏదోలా ప్రయత్నిద్దాంలెండి" శ్రీమతి ఓదార్పుగా అంది.

'అవును. నేనెందుకు ఇంతలా బాధపడిపోతున్నాను. అసలు దానికీ నాకూ ఏమిటి అనుబంధం? ఈ విశాల విశ్వంలో అనంత ప్రాణకోటిలో ఒక చిన్న ప్రాణి అపాయంలో ఉందని నా మనసు ఇంత బాధపడుతున్నదే! మరి సినిమాల్లోనూ, టీవీ సీరియల్స్‌లోనూ మనిషి మనిషే కత్తులతో పొడవడం, గొడ్డళ్లతో నరకడం, బాంబులు పెట్టి పేల్చేయడం... పీపాల కొద్దీ రక్తాన్ని పారించి టన్నుల కొద్దీ హింసను చూపిస్తున్నారే! లోకంలో జాలి, దయ, కరుణ అంతరించిపోతున్నాయా!

ప్రేమానురాగాలకూ, మమతానుబంధాలకూ దూరమవుతున్న నేటి సమాజం ఎటువైపు పయనిస్తోంది? ఇదే సంఘటన ఏ పల్లెటూరిలోనో జరిగితే? ఏదో ఒక సాయంతో ఎవరో ఒకరు నూతిలోకి దిగి దాన్ని జాగ్రత్తగా బయటకు తీసేవారు కదా. అవును. రేపు ఉదయానికి ఒకవేళ ఆ బకెట్‌లోకి ఆ పిల్లి రాకపోతే? దాన్ని ఎలా తీయాలి?

ఎవరినన్నా నూతిలోకి దింపించి తీయించాలి. అందుకైనా బలమైన తాళ్ళు కావాలి. 'హే భగవాన్' ఆలోచనలతో నుదురు అరచేతితో రుద్దుకున్నాను.

"మీరింకా నిద్రపోలేదా? ఇంకా ఆ పిల్లి గురించే ఆలోచిస్తున్నారా ఏమిటి ఖర్మ?" శ్రీమతి పనులు చక్కబెట్టుకుని వస్తూ అంది.

ఉక్కపోత అధికంగా ఉండడంతో పక్క బట్టలు తీసుకుని డాబా మీదకు వెళ్లాను. నగర సంబంధమైన రణగొణ ధ్వనులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. నీలాకాశం చుక్కల చీరలో తళుకులీనుతోంది. నాలో క్రమంగా జ్ఞాపకాల తెరలు తెరుచుకున్నాయి.

***

"ఏమిటండీ ఇంకా నిద్రపోలేదా?" శ్రీమతి అటునుండి ఇటు వత్తిగిల్లుతూ అంది.

"లేదోయ్! నా చిన్నప్పటి సంఘటన గుర్తుకువస్తుంటే ఆలోచిస్తున్నాను" అన్నాను ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్లుగా.

"ఏమిటండీ అది" కుతూహలం కనబర్చింది శ్రీమతి.

"నేను బహూశా నాలుగు లేక ఐదవ తరగతి చదువుతున్న రోజులు. స్కూళ్లకు వేసవి సెలవులు ఇచ్చేసారు. విశ్వేశ్వరరావుగారని మాస్టారుండేవారు. ఆయన ఉదయం పూట స్కూళ్లల్లో ప్రైవేటు చెప్పేవారు సెలవులలో. నేను ఆ సెలవులలో పూర్తిగా పుస్తకాలు మరచిపోతానని మా నాన్నగారు నన్ను కూడా ఆ ప్రైవేట్‌లో చేర్పించారు.



ఆ రోజు కూడా ఎప్పటిలాగానే ఉదయమే ప్రైవేట్‌కి వెళ్లాను. కానీ ఎందువల్లో రోజూ ఆ సరికే తయారుగా వుండే మాస్టారు ఆ రోజు ఇంకా రాలేదు. ఈలోగా పిల్లలంతా దొంగ, పోలీసు ఆట మొదలుపెట్టారు. ఒకరినొకరు పట్టుకుంటూ అరుపులతో, కేకలతో అక్కడ మరో కిష్కింద ఆవిష్కృతమయింది.

సరిగ్గా ఆ ఆనందాల ఒరవడిలోనే జరిగిందా అపశృతి

"ఏమైందండీ?" లేచి కూర్చుని అడిగింది శ్రీమతి.

"ఆ స్కూలు పెరట్లో ఇప్పటి మన ఇంటిలో లాగానే ఒక నుయ్యి ఉండేది. కానీ అది వాడుకలేక చెత్తాచెదారంతో కప్పబడిపోయింది. అయినా లోతు మాత్రం ఎక్కువే వుండేది. దానికి అడ్డంగా పైన పాత చెక్కముక్కలు వేసారు. ఆ రోజు దొంగా పోలీసు ఆట ఆడుతున్నాం అని చెప్పానుకదా. దొంగగా వున్న అబ్బాయి ముందు పారిపోయాడు. వాడిని వెంబడిస్తూ నేను ఆ నూతిపైన బల్లచెక్కపై అడుగువేసాను. అంతే!"

"కొంపదీసి నూతిలో పడిపోయారా ఏమిటి ఖర్మ" ముందుకు వంగుతూ అంది.

"పెళపెళా బల్ల చెక్క విరిగిపోయి ఒక్క ఉదుటున నూతిలోకి జారిపోయాను"

"ఆ..." తృళ్లిపడింది శ్రీమతి.

"ఆహా... నేను పడిపోవడమేమిటి? మిగిలిన పిల్లలంతా చిల్లపెంకుల్లా చెదిరిపోయి అరుచుకుంటూ పరుగులుతీసారు.

క్షణాల్లో వార్త వీధిలోకి, ఊరిలోకి ప్రాకిపోయింది.

ఇక చూసుకో ఒకటే జనం. నూతి గట్టు దగ్గరకు రావడం, లోనికి తొంగి చూడడం.

"దెబ్బలేమన్నా తగిలాయా?" అని ఆరాలు.

"నీకేం ఫర్వాలేదు"

అని ఓదార్పులు.

అయితే అంత ఎత్తు నుండి అంత లోతుకు జారిపడినా అదృష్టవశాత్తు చిన్న దెబ్బ కూడా తగలలేదు నాకు. పైనుంచి అడిగినవాటికి సమాధానం చెబుతూనే వున్నాను. సమయం గడిచిపోతోంది.

అందరూ నాకు ధైర్యం అయితే చెబుతున్నారు కానీ నన్ను ఎలా బయటకి తీయాలో ఎవరికీ పాలుపోవడంలేదు. రకరకాల ఉపాయాలు... బాగోగుల చర్చలు.

చివరగా అటుగా వెళ్తున్న ఒక లారీని ఆపి అందులో వున్న మోకును తెచ్చాను. ముందుగా దాన్ని నూతిలోకి జారవిడిచి కొసను గట్టిగా పట్టుకోమన్నారు.

'నేను దాన్ని మధ్యలో భయానికి వదిలేస్తేనో?' అంతలోనే వారికి అనుమానం.

ఈసారి ఒక నిచ్చెనను తెచ్చి ఆ మోకుతో నిచ్చెనను రెండువైపులా కట్టి నిలువుగా క్రిందకు జారవిడిచారు.

అప్పుడు నేను నిచ్చెన మెట్లు ఎక్కి రెండు చేతులతో గట్టిగా నిచ్చెనను పట్టుకున్నాను.

దాన్ని నెమ్మదిగా పైకి లాగారు. అలా పునర్జన్మ పొంది ఈనాడు ఇలా ఈ స్థితిలో ఉన్నాను" చెబుతుండగానే కళ్లమ్మట నీళ్ళు కారాయి.

"అవునండీ. నిజంగా మీరు... కాదు కాదు మేం అదృష్టవంతులం. లేకపోతే ఈనాడు మనం ఇలా కలసి ఉండేవాళ్ళం కాదుకదా?" శ్రీమతి కూడా కళ్లొత్తుకుంటూ అంది.

"ఆనాటి సంఘటనను గుర్తు చేయడానికే జరిగిందేమో ఈనాటి సంఘటన"

"అవునండీ. ఇది నిజంగా ఏనాటి అనుబంధమో? రేపు ఎలాగైనా ఆ పిల్లిని రక్షించాలి" దృఢంగా అంది శ్రీమతి నా ఆలోచనలకు బలాన్ని చేకూరుస్తూ.

తెల్లవారేవరకూ కలత నిద్రే అయింది.

***

వెలుగురేఖలు విచ్చుకుంటుంటే నేను మళ్ళీ కార్యరంగంలోకి దూకాను.

ముందుగా నూతిలోకి తొంగిచూసాను.

పిల్లి నిశ్చలంగా పడివుంది. అనుమానంతో ఒక చిన్న రాయిని తీసి దాని మీదకు విసిరాను.

అది ఒక్క ఉదుటున లేచి 'మ్యావ్...మ్యావ్' అంటూ తిరగసాగింది.

'థాంక్‌గాడ్' అనుకుంటూ బకెట్‌కి కట్టిన తాడు అందుకుని ఆ బకెట్‌ని తాడుతో కదుపుతూ పిల్లి ముందుకు నెట్టి అందులో దిగమన్నట్లుగా సైగలు చేయడం మొదలుపెట్టాను.

ఉదయాన్నే నూతి దగ్గర నా హడావుడి చూసి పక్కింటి వాళ్లు కూడా వచ్చి వాళ్లకు తోచిన సలహాలు వాళ్ళు ఇవ్వడం మొదలుపెట్టారు.

కాలం కరిగిపోతోంది.

మా అబ్బాయి వీధిలో బట్టలు ఆరేసుకోవడానికి దండెంగా కట్టిన తాడును విప్పి దానికి ఒక చివర జారుముడివేసి నూతిలోకి వదిలాడు. నేను బకెట్‌తో పిల్లిని ఆ తాడువైపు నెట్టడం మొదలపెట్టాను. కొద్దిసేపటికి పిల్లి తాడులోకి తల దూర్చింది.

అది చూచిన అందరి మొహాల్లోనూ కొంచెం నవ్వు వచ్చింది. నెమ్మదిగా తాడుని పైకి లాగడం ప్రారంభించాడు మా అబ్బాయి.

'ఆ తాడు ముడి బిగుసుకోంటుందేమో?' అని అందరిలోనూ ఆందోళన.

అంతలోనే అది ముడి నుండి జారిపోయి మళ్ళీ దబ్బున నూతిలోకి పడిపోయింది.

అయ్యో మళ్లీ అందరి మొహాల్లోనూ నిస్పృహ.

పోనీ ఎవరినన్నా నూతిలోకి దింపాలన్నా సరైన తాళ్ళు లేవు.

అయినా కిందకి దిగిన వాళ్లని పిల్లి మీదపడి రక్కితే?

మళ్లీ తాడునే ఈసారి కొంచెం పెద్దముడిని వేసి జారవిడిచాను.

పావుగంట తరువాత మా శ్రమ ఫలించింది.

ఈసారి పిల్లి ఆ తాడులోకి తలతోపాటు ముందరి రెండు కాళ్లనుకూడా దూర్చింది. ముడి దాని నడుమువరకు వచ్చేటట్లు సరిచేసాము.

'అవును. అవసరమే ఏ ప్రాణికయినా ఆలోచనలను ప్రేరేపిస్తుంది'

ఇప్పుడు కాస్త ధైర్యంగానే పిల్లిని బయటకు లాగాము. అందరి మొహాల్లోనూ రిలీఫ్ తొంగి చూసింది.

పిల్లిని భూమి మీదకు దించగానే అది పరుగులు తీసింది. అయితే దానికి కట్టిన తాడు అలాగే వుంది. అది విప్పడానికి ఎవరు దగ్గరకు వెళ్లినా పళ్లికిలిస్తూ మీదకు వచ్చేస్తోంది.

"బయటకు తీసాం కదా? ఆగు పిల్లల దగ్గరకు వెళ్తువుగానీ" అంటూ నేను దాని దగ్గరకు వెళ్లాను.

నన్ను చూడగానే అదేమీ అనకుండా కూచుండిపోయింది.

దగ్గరకు వెళ్లి నడుము దగ్గర తాడును వదులు చేసి తప్పించి దాన్ని చేతిలోకి తీసుకుని రెండో చేత్తో నిమిరాను.

దాని ఒళ్ళు ఎంతగా కంపిస్తోందో ఆ చేతి స్పర్శతో అర్థమైంది.

నెమ్మదిగా పిల్లలున్న వైపు వదిలాను.

ఒక్క అంగలో దాని పిల్లలను చేరుకుని అన్నింటినీ నాలుకతో తడిమింది.

ఆ దృశ్యాన్ని చూస్తున్న మా కళ్ళు చెమర్చాయి.

ఈలోగా శ్రీమతి అప్పుడే తెచ్చిన పాలను ఒక గిన్నెలో పోసి తెచ్చి దాని ముందు పెట్టింది.

★

# జడ్జీగారి తీర్పు

స్పెయిన్‌లోని బార్సిలోనా నగరంలో కోర్టులోకి ఓ కేసు విచారణకు వచ్చింది. లతీఫా అనే ఆమె తన మగడు తనను నిత్యం హింసిస్తున్నాడనే అభియోగం తెచ్చింది. "ఈమె రోజూ కొత్త కొత్త డ్రెస్సులు వేసుకు వస్తోంది. రోజుకో చక్కని చెవిరింగు మార్చుకు వచ్చింది. వేసింది వేయకుండా రోజూ చేతి కంకణాలు మార్చింది. ఇంత ఆడంబరంగా అలంకరణ చేసుకువస్తూ ఈమె ఖుషీఖుషీగా కనబడుతుంటే గత కొన్ని నెలలుగా తన మగని చేతుల్లో హింస అనుభవిస్తున్న దానిలా ఎక్కడా కనిపించడం లేదు. ఇదంతా ఈమె అభూతకల్పనలా నాకనిపిస్తోంది" అని జడ్జి కేసు కొట్టేసారు.

# నిప్పునార్పిన డోరీ

ఓ అర్ధరాత్రివేళ ఫైర్ స్టేషన్‌లో స్మోక్ అలారం మోగింది. సంకేతం ప్రకారం ఫైరింజన్ వాళ్ళు ట్రినిటీ లోన్‌ఓక్ లుథెరిక్ స్కూలు చేరుకున్నారు. మూసివున్న స్కూల్లో అంత అర్ధరాత్రివేళ స్మోక్ అలారం రావడమేమిటా అని వాళ్ల తలుపులు తెరుచుకుని లోపలికి వెళ్లి జరిగింది చూసి ఆశ్చర్యపోయారు. లేబరేటరీలో ఏదో టెస్టు కోసం వెలిగించిన కొవ్వొత్తిని ఆర్పడం మరచిపోయారు. అది చివరిదాకా వెలిగి కర్రటేబుల్‌ని కాల్చినప్పుడు పొగ లేచింది. ఆ మాత్రం పొగకే దానిమీదున్న అలారం మ్రోగింది. నిశ్శబ్దమైన ఆ వాతావరణంలో టేబుల్ మీద కొవ్వొత్తి పక్కనే చిన్న గిన్నెలో నీళ్లల్లో డోరీ అనే చేప అదిరిపడింది. దాని గెంతులకి గిన్నెలోని నీళ్ళు నలుమూలలా చింది నిప్పంటుకున్న మేరా ఆరిపోయింది.

—విమలారామం

